నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | RANGAREDDY


సర్వేలో భాగంగా రైతు, పంట ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఏఈవో

## సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళి



మహేశ్వరం సెగ్మెంట్‌లోని ఉప్పుగడ్డతండా, లెనిన్‌నగర్, మీర్‌పేటల్లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పాల్గొని ఆయన చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

-బడంగ్‌పేట ఫిబ్రవరి 16

# ఏ సర్వే నంబర్‌లో ఏ పంట..

### రంగారెడ్డి జిల్లాలో పక్కాగా సాగుతున్న పంటల లెక్క

జిల్లాలో పంటల లెక్క వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పకడ్బందీగా సాగుతున్నది. ఏ సర్వే నంబర్‌లో ఏ రైతు ఏ పంట వేశాడో స్పష్టంగా తెలుసుకుంటున్నారు. ఏఈవోలు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలకెళ్లి ఆయా సర్వేనంబర్లలో వేసిన పంట, రైతుల వివరాలను పూర్తిగా తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో మొదటి విడత 81 క్లస్టర్లలోని 1,65,000 డిజిటల్ సర్వే చేయాలని అధికారులు భావిస్తున్నారు. శాటిలైట్ ద్వారా ఏ రైతు ఏ పంట వేశాడదన్నది సులభంగా తెలుసుకోవచ్చు. దీనిని జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

-రంగారెడ్డి, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ)

- వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వరంలో పకడ్బందీగా నిర్వహణ
- పైలట్ ప్రాజెక్టు కింద క్లస్టర్‌కు 2000 ఎకరాల్లో సాగుతున్న డిజిటల్ సర్వే
- జిల్లాలోని 1,65,000 ఎకరాలకు విస్తరించాలని భావిస్తున్న అధికారులు

### విధుల్లో 81 మంది ఏఈవోలు

ఒక్కో క్లస్టర్‌ను ఒక్కో ఏఈవో సర్వే చేసి పంటల లెక్కలను పక్కాగా నమోదు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద క్లస్టర్‌కు 2000 ఎకరాలను మాత్రమే సర్వే చేయాలని నిర్ణయించారు. అనంతరం ఈ సర్వేను జిల్లాలోని అన్ని గ్రామాలకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. మొదటి విడత జిల్లాలోని 81 క్లస్టర్లలోని 1,65,000 ఎకరాల్లో ఈ సర్వే చేయాలని అధికారులు భావిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వేనంబర్లలోని సబ్‌డివిజన్లు ,ఎంతమంది రైతులున్నారు. ఏయే పంటలు వేశారనే వివరాలతో పాటు రైతులు, పంటల ఫొటోలనూ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మొదటి విడత సర్వే పూర్తి కాగానే రెండో విడతలో మరిన్ని గ్రామాల్లో డిజిటల్ సర్వేను ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సర్వేకోసం జిల్లాలో 81 మంది ఏఈవోలు విధులు నిర్వహిస్తున్నారు.

### సాంకేతిక సమస్యలు..

జిల్లాలో కొనసాగుతున్న డిజిటల్ సర్వేకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఉన్న సర్వేనంబర్లకు వ్యవసాయాధికారులు వెళ్లినప్పుడు అక్కడి పంట వివరాలను తెలుసుకుని.. పంటలు, రైతుల ఫొటోలు తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు సిగ్నల్ రాకపోవడం, సర్వర్ డౌన్ కావడం వంటి పలు సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లాలోని శివారు మండలాలైన మంచాల, యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, కేశంపేట, కొందుర్గు వంటి మండలాల్లో ఈ సమస్య తలెత్తుతున్నది. సరిగ్గా సిగ్నల్ లేకపోవడం డిజిటల్ సర్వేకు అంతరాయంగా మారుతున్నది. సాగుకు యోగ్యం కాని భూముల ను కూడా ఈ సర్వే ద్వారానే అధికారులు గుర్తిస్తున్నారు.

### ముమ్మరంగా డిజిటల్ సర్వే



జిల్లాలో పంటల సాగు లెక్కకు సంబంధించిన డిజిటల్ సర్వే ముమ్మరంగా సాగుతున్నది. సర్వేకోసం జిల్లాలోని పైలట్ గ్రామాలను గుర్తించాం. 81 క్లస్టర్లలోని 1,65,000 ఎకరాల్లో పంటల సాగుకు సంబంధించి డిజిటల్ సర్వే చేయాలని నిర్ణయించాం. 81 మంది వ్యవసాయాధికారులు తమకు కేటాయించిన గ్రామాలకెళ్లి ఏ సర్వేనంబర్‌లో ఏ పంట వేశారో గుర్తించి రైతులు, పంట ఫొటోలు తీసుకుని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. త్వరలోనే సర్వేను పూర్తి చేస్తాం.

-నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి

### ఇబ్బందిగా సాంకేతిక సమస్యలు

గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న డిజిటల్ సర్వేకు సాంకేతిక సమస్యలు ఇబ్బందిగా మారా యి. గ్రామాల్లో పంటల సర్వేను రెండు నుంచి మూడుసార్లు చేయాల్సి వస్తున్నది. సాంకేతిక సమస్యలతో పాటు సిగ్నల్, సర్వర్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి



-శ్రవణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఏఈవో

# పింఛన్ల పెంపు ఎప్పుడో..?

## ఆసరా లబ్ధిదారులకు ఇంకా పాత పింఛన్లే

- పింఛన్ల పెంపు లేదు.. కొత్త పింఛన్లకు మోక్షమూ లేదు
- ఇచ్చిన హామీ ఏమయ్యిందంటూ నిలదీస్తున్న ప్రజలు
- వృద్ధులు, వితంతువులు తదితరులకిచ్చే పింఛన్‌ను రూ.4,000, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6,000లకు పెంచుతామని హామీ
- పింఛన్ల పెంపుపై ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



తాము అధికారంలోకి రాగానే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే ఆసరా పింఛన్లను పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పవర్‌లోకి రాగానే ఆ మాటే మరిచిపోయారు. ఆ పింఛన్లతోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులు 14 నెలలు దాటినా పింఛన్ల పెంపు ఎప్పుడంటూ ఆశగా ఎదురు చూస్తున్నారు. లబ్ధిదారులకు ఇంకా పాత పింఛన్లనే ఇస్తున్నారని మీరు ఇచ్చింది ఉత్తుత్తి హామీనేనా.. అని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల పెంపుతోపాటు జిల్లాలో 30,000 పైచిలుకు మంది అర్హులైన లబ్ధిదారులు తమకు కొత్త పింఛన్లను ఎప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

-వికారాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ)

వికారాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా పేదలకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరడం లేదు. కేవలం ఆరు గ్యారెంటీలు, ఒకట్రెండు పథకాల గురించే సీఎం, మంత్రులు ప్రస్తావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే రూ.2016 పింఛన్‌ను రూ. 4,000.. దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4,000 నుంచి రూ.6,000లకు పెంచుతామని పలువురు నాయకులు హామీనిచ్చారు. వారి మాటలు నమ్మి ఓటేసి గెలిపించగా.. 14 నెలలు గడిచినా పెంపు ఎప్పుడో అంటూ ఆసరా పింఛన్‌దారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు అంటూ కాంగ్రెస్ సర్కార్ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నా ప్రతి పథకంలోనూ ఏదో ఒక కొర్రీ పెడుతూ అర్హులను లబ్ధిదారుల జాబితాలో లేకుండా చేస్తుండడంతో వేలాది మంది పేదలకు పథకాల ఫలాలు అందడంలేదు. అదేవిధంగా కొత్త పింఛన్లను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి ఇంకా పాత పింఛన్లే ఇస్తుండడంతోపాటు అర్హులైన 30 వేలకు పైగా లబ్ధిదారులు తమకు కొత్త పింఛన్లు ఎప్పు డంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ప్రతినెలా అందించే పిం ఛన్ డబ్బుల పంపిణీలోనూ జాప్యం జరుగుతుండడం గమనార్హం. పింఛన్ల పంపిణీకి సంబంధించి బీఆర్‌ఎస్ హయాంలో ప్రతినెలా 20లోగా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందగా.. ప్రస్తుత రేవంత్ సర్కారు మరో 20 రోజులు ఆలస్యంగా డబ్బులను పంపిణీ చేస్తున్నది.

### ప్రతినెలా జాప్యమే..

ఆసరా పింఛన్లతోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులకు కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే పింఛన్ల పంపిణీలో జాప్యం చేస్తున్నది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రతినెలా 29 లేదా 30న ప్రారంభమై వారం రోజుల్లో ముగుస్తుండగా.. కొడంగల్ నియోజకవర్గంలోని లబ్ధిదారులు మాత్రం మొదటి వారం పూర్తయ్యే వరకు నిరీక్షించాల్సి వస్తుండడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే కొడంగల్ సెగ్మెంట్‌కు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆసరా పింఛన్ల నిమిత్తం నిధులు మంజూరు అవుతుండగా.. వికారాబాద్, తాండూరు, పరిగి సెగ్మెంట్లకు రంగారెడ్డి జిల్లా నుంచి వస్తున్నాయి. కాగా జిల్లాలో 98,793 మంది పింఛన్‌దారులకు రూ. 24.38 కోట్ల డబ్బులను పంపిణీ చేస్తున్నారు.

### దేశంలో ఎక్కడాలేని విధంగా..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమల్లోకి తెచ్చి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్ డబ్బులను పెంచింది. పింఛన్‌దారులకు అండగా ఉండేందుకు వృద్ధులు, వితంతువులు తదితరులకిచ్చే రూ. 200 పింఛన్‌ను రూ.1000, దివ్యాంగులకు ఇచ్చే రూ.500 పింఛన్‌ను రూ. 1500, తదనంతరం రెండోసారి అధికారంలోకి రాగానే రూ.1000 నుంచి రూ.2016, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 1500–రూ. 3016, తదనంతరం దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు రూ.4016లకు పెంచి పేదల ప్రభుత్వంగా కేసీఆర్ సర్కార్ నిలిచింది.

### పింఛన్ల పంపిణీలో తీవ్ర జాప్యం..


కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికలప్పుడు తాము అధికారంలోకి రాగానే రూ. 2016గా ఉన్న పింఛన్‌ను రూ.4000లకు పెంచుతామని హామీ ఇచ్చారు. వారు గద్దెనెక్కి 14 నెలలు దాటినా ఇంకా పింఛన్ డబ్బులను పెంచలేదు. అంతేకాకుండా ప్రతినెలా ఆ డబ్బులను చాలా ఆలస్యంగా చెల్లిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పిం ఛన్ల పంపిణీ సక్రమంగా జరిగింది.



-బీ.నర్సమ్మ
రావులపల్లి, మర్పల్లి మండలం

### మాటలే.. చేతలు నిల్

కాంగ్రెస్ నాయకులవి మాటలే .. చేతలు నిల్.. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని గొప్పగా చెప్పుకొని ఓట్లు వేయించుకుని.. గద్దెనెక్కి ఇచ్చిన అన్ని హామీలను మరిచిపోయారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటినా ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయడంలేదు. అంతేకాకుండా పింఛన్లను కూడా పెంచలేదు. ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పింఛన్లను రూ.4000లకు పెంచాలి.



-బుజంగా రెడ్డి దామస్తాపూర్, మర్పల్లి మండలం

# శునకాగ్రహం..

## ఏటా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా తగ్గని కుక్కకాట్లు

- రెచ్చిపోతున్న వీధి కుక్కలు.. చిన్నారుల ప్రాణాలను తీస్తున్న వైనం
- ప్రమాదకరమైన, దీర్ఘకాలిక రోగాల బారిన పడిన కుక్కలపై కొత్త అస్త్రం
- మెర్సీ కిల్లింగ్‌కు అనుమతి ఇవ్వాలంటూ హైకోర్టును కోరిన బల్దియా



| ఏడాది | ఏబీసీ(కుక్కల సంఖ్య) | ఏఆర్ | ఖర్చు(రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2022-23 | 36,890 | 63,025 | 9.02 |
| 2023-24 | 53,375 | 86,303 | 12.84 |
| 2024-25 | 33,395 | 70,247 | 7.80 |
| (15డిసెంబర్2024) | | | |

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మొన్న రాజేంద్రనగర్...నిన్న ఉప్పల్‌లో చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఇలా వరుస ఘటనలు చిన్నారుల తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చిన్నారులను మొదలుకొని మహిళలు, వృద్ధుల వరకు ఎవరినీ వదలడం లేదు. బయట మనిషి కనబడితే చాలు కరిచి పడేస్తున్నాయి. పగబట్టినట్లే ప్రవరిస్తూ కండలు పీకేస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట జనాలు కుక్కకాటుకు బలవుతున్న పరిస్థితి. వందలాది మందిని దవాఖానలకు గురి చేస్తున్నాయి. నారాయణగూడలోని ఐపీఎం (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్)కు కుక్కకాట్లతో దాదాపు 100 మందికి పైగా బాధితులు క్యూ కడుతున్నారంటే కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక జీహెచ్‌ఎంసీ వీధి కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా నియంత్రణ చర్యలు చేపడుతున్నది. ప్రధానంగా వీధి కుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్) ఆపరేషన్లేగాక, రేబిస్ నివారణ టీకాలను వేయడంలో జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వహిస్తున్నది. ఏబీసీ ఆపరేషన్లు పెంచేందుకు మూడు జోన్లలో జంతు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు విషయంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రధానంగా రాబోయే వేసవిలో ఒక పక్క ఎండ వేడి, మరోపక్క చెత్త వ్యర్థాల డంపింగ్ వద్ద నిల్వ ఉన్న వ్యర్థాలను తిని కుక్కల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుని, కనిపించిన వారిపై పిచ్చికోపంతో దాడులకు తెగబడే అవకాశాలు లేకపోలేదు. సహజంగా ఎండాకాలంలో తాగునీటి వసతి తక్కువగా ఉండడంతో వేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వీధి కుక్కల్లో ప్రకోపం (ఇరిటేషన్) అధికం గా ఉంటుంది. వీధి కుక్కలకు సంతాపన నిరోధక శస్త్ర చికిత్సలు, వ్యాక్సిన్లు చేశామని చెబుతున్నా..పెరుగుతున్న వరుస కుక్క కాట్లు అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి.

మూడేండ్లలో ఏబీసీ, ఏఆర్‌లకు రూ 29.66కోట్లు జీహెచ్‌ఎంసీ పరిధిలో 3.79 లక్షల వీధి కుక్కలుండగా.. వీటిలో 77 శాతం కుక్కలకు మాత్రమే స్టెరిలైజేషన్ చేస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.. కుక్కల నియంత్రకు 'కంట్రోల్ ఆఫ్ స్ట్రే యానిమల్స్' హెడ్ పేరుతో ప్రతి ఏడాది నిధులు కేటాయిస్తున్నారు. స్టెరిలైజేషన్స్, వ్యాక్సినేషన్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఇతర జంతువుల సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు మూడేండ్లలో రూ.29.67కోట్లు ఖర్చు చేశారు. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ రేబిస్(ఏఆర్) కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయినా 70 శాతం కుక్కలకు ఆపరేషన్లు కూడా చేయలేదని అధికారిక లెక్కలు చెబుతుండటం గమనార్హం.

### ప్రమాదకరమైన కుక్కలను..

ప్రమాదకరమైన, దీర్ఘకాలికంగా రోగాలబారిన పడిన కుక్కలను నియంత్రించేందుకు ఉన్న చట్టాలను పట్టించుకోవడంలేదన్న విమర్శలూ లేకపోలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఎంతోమంది చిన్నారులు కుక్కల దాడుల్లో మరణించారు. ఈ క్రమంలోనే 2023లో అంబర్‌పేటలో నాలుగేండ్ల బాలుడ్ని కుక్కలు పీక్కుతున్న ఘటనను హైకోర్టు సుమోటగా స్వీకరించింది. ఈ కేసు నేపథ్యంలో కుక్కల నియంత్రణ ఖర్చు వివరాలు, ప్రమాదకరమైన కుక్కలను చంపేందుకు అనుమతివ్వాలని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే వీధి కుక్కల నియంత్రణకు జీహెచ్‌ఎంసీ కొత్త పంథాను ఎంచుకున్నది. 1960 ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ యాక్ట్ 1960లోని సెక్షన్ 11(3)(బీ), 11(3)(సీ), జీహెచ్‌ఎంసీ 1955 చట్టంలోని సెక్షన్ 249 ప్రకారం ప్రమాదకరమైన, దీర్ఘకాలిక రోగాల బారిన పడిన కుక్కలను యూథనేసియా(మెర్సీ కిల్లింగ్) ద్వారా (కుక్కలకు స్టెరిలైజేషన్ చేసే సమయంలో మత్తు ఇంజెక్షన్లు ఎక్కువ మోతాదులో ఇచ్చి చంపేందుకు) చంపేందుకు అనుమతించాలని జీహెచ్‌ఎంసీ హైకోర్టును కోరింది. దీనిపై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటనేది వేచి చూడాల్సిందే. ఒకవేళ మెర్సీకిల్లింగ్‌కు హైకోర్టు అనుమతిస్తే యనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారమే ప్రాసెస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. 2008లో బాంబే హైకోర్టు, 2015లో కేరళ హైకోర్టు కుక్కలను చంపేందుకు మెర్సీ కిల్లింగ్‌కి అనుమతిచ్చాయి. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ యానిమల్ యాక్టివిస్టులు సుప్రీం కోర్టుకెళ్లారు. కేంద్ర పశుసంవర్ధక శాఖ కూడా 2022లో తీసుకొచ్చిన ఎనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్‌లో మెర్సీ కిల్లింగ్‌ను సమర్థించింది.



| ఏడాది | ఏబీసీ/ఏఆర్(కుక్కల సంఖ్య) | ఖర్చు(రూ.కోట్లలో) |
|---|---|---|
| 2020-21 | 9,226 | 1.38 |
| 2021-22 | 24,720 | 3.70 |
| 2022-23 | 12,257 | 1.83 |
| 2023-24 | 8,725 | 1.30 |
| 2024-25 | 6,474 | 97లక్షలు |
| (15డిసెంబర్2024) | | |
| మొత్తం | 61,402 | 9.18 |

### ఏడబ్ల్యూవోకు రూ.9.18 కోట్లు

కుక్కల నియంత్రణలో భాగంగా స్టెరిలైజేషన్, యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహించే యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్(ఏడబ్ల్యూవో)లకు జీహెచ్‌ఎంసీ ఆర్థికంగా, లాజిస్టికల్‌గా చేయూతనందిస్తున్నది. ఐదు సంస్థలకు కుక్కల ఆపరేషన్లు ఇతర కార్యక్రమాలను నిర్వహించేందుకు ఐదేండ్లలో రూ.9.18 కోట్ల వరకు ఖర్చు చేశారు.


గ్రీన్ ఇండియా చాలెంజ్, వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను సక్సెస్ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 15 : ఈనెల 17న మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్, వృక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మున్సిపల్ కేంద్రంలో గ్రీన్ ఇండియా చాలెంజ్, వృక్షార్చన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేసీఆర్ పుట్టిన రోజున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మధుసూదన్ రావుయాదవ్, మహిపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, భీములు, నరేశ్, సోమనాథ్, రవిగౌడ్, మల్లేశ్, పాల్గొన్నారు.

## హామీల అమల్లో సర్కార్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- రైతుదీక్షపై సన్నాహక మీటింగ్


సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఫిబ్రవరి 15 : హామీల అమల్లో విఫలమైన ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన నాయ కులు, కార్యకర్తలతో ఈ నెల 18న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించనున్న రైతుదీక్షకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వాటిని నెరవేర్చడంలేదని ఎద్దేవా చేశారు. హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులు పెడుతూ..డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో నిర్వహించనున్న రైతుదీక్షలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. దీనికి నాయకులు, అన్నదాతలు, భారీగా తరలివచ్చి సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, విజితారెడ్డి, మాజీ ఎంపీపీలు నిర్మల, శ్రీనివాస్‌యాదవ్, రాంరెడ్డి, జైపాల్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆనంద్, పరమేశ్, శంకర్, రాజేందర్‌యాదవ్, రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఈ నెల 17న మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ.. శనివారం మండల కేంద్రంలో వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జైపాల్‌యాదవ్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రవితేజ, నర్సింహగౌడ్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, ఆనంద్, గోవర్ధన్, వెంకటేశ్‌గుప్తా, జైపాల్‌రెడ్డి, లచ్చిరాం నాయక్, రమేశ్, శ్రీనూనాయక్, జంగయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఖలీల్, సూర్యప్రకాశ్‌రావు, పాల్గొన్నారు.